సాక్షి
గుంటూరు
శుక్రవారం । 10 । మార్చి । 2023



అభివృద్ధి పనుల పరిశీలన

రాజుపాలెం: దేవరంపాడు కొండపై వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం పరిశీలించారు.



నృసింహుని అలంకారోత్సవాలు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఆస్థాన అలంకారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ రామకోటిరెడ్డి తెలిపారు.

ఒక కరోనా కేసు నమోదు



గుంటూరు మెడికల్: జిల్లాలో గురువారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. గుంటూరు నగరంలోని నగరంపాలెం పరిధిలో నమోదు అయింది. కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మాధవరెడ్డికి ఐపీఎస్ హోదా



నగరంపాలెం(గుంటూరు): రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి నాన్‌కేడర్ (ఎన్‌సీ) ఎస్పీ నుంచి ఐపీఎస్ హోదా పొందారు. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. 2021 ఆగస్టు 25న మాధవరెడ్డి గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ఆయన 2006లో రేంజ్ అటవీశాఖ అధికారిగా నాలుగేళ్ల పాటు విధులు నిర్వహించారు. 2010లో గ్రూప్–1 ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. నిర్మల్ (మహబూబ్‌నగర్), ఆత్మకూరు (కర్నూలు), మంగళగిరి డీజీపీ కార్యాలయ టెక్నికల్ సర్వీసెస్, పోలీస్ అకాడమీలో ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తించారు. 2018లో ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. కర్నూల్ జిల్లా పరిపాలన, విజయవాడ సిటీ (ట్రాఫిక్) ఏడీసీపీగా, గవర్నర్ ఇన్ రాజ్‌భవన్ ఏడీసీగా విధులు నిర్వహించి, గుంటూరు జిల్లాకు బదిలీపై వచ్చారు.

టెన్త్ ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు గురువారం ప్రీ–ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రీ–ఫైనల్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేలా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 36,155 మంది విద్యార్థులకు ప్రీ–ఫైనల్ పరీక్షలు మొదలయ్యాయి. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి.

11న తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఆమె గురువారం డీఈవో కార్యాలయంలో మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల ప్రగతి, విద్యా సంవత్సరం పొడవునా నిర్వహించిన పరీక్షల్లో సాధించిన మార్కులు, అభ్యసన సామర్థ్యంపై తల్లిదండ్రులతో చర్చించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

యార్డుకు 1,25,326 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,25,326 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,19,260 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 84,740 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నేడు సిమ్స్‌లో జాబ్ మేళా

గుంటూరు మెడికల్: ఫార్మసీ రంగంలో దిగ్గజాలైన రెడ్డీస్ ఫార్మా, అరబిందో, హెట్రో వంటి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలనుకునే వారు శుక్రవారం గుంటూరు మంగళదాస్ నగర్‌లోని సిమ్స్ విద్యా సంస్థల్లో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష గురువారం తెలిపారు. డిగ్రీ, ఫార్మసీ పూర్తయిన విద్యార్థులు, చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

రగడల రహస్యమిదేనా!

- సత్తెనపల్లి, గుంటూరులో వర్గాల మధ్య పోరుకు ఆజ్యం
- ముందస్తు వ్యూహంతోనే గ్రూపుల కొనసాగింపా?
- పొరుగు నేతల బెర్త్ రిజర్వుకేనా ఎత్తుగడలు
- యువ నాయకులు, సీనియర్లలో అంతర్మథనం
- చంద్రబాబు తీరుపై ముఖ్యుల మండిపాటు

▶▶ ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడైన మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 2019 సెప్టెంబరు 16న ఆత్మహత్య చేసుకున్నారు. సత్తెనపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆయన మరణం తరువాత అక్కడ టీడీపీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా తయారైంది.

▶▶ గుంటూరు పశ్చిమం నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన మద్దాళి గిరిధరరావు టీడీపీకి దూరమయ్యారు. అప్పటి నుంచి అక్కడా సరైన నాయకత్వం లేదు. కోవెలమూడి రవీంద్రకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ గ్రూపులను పెంచి పోషించడానికే టీడీపీ అధినాయకత్వం ప్రాధాన్యతనిస్తోందనేది నిష్ఠురసత్యం.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి



నియోజకవర్గాలలో టీడీపీ నాయకుల మధ్య గ్రూపులు, గొడవలు వాటంతట అవే ఏర్పడి కొనసాగుతున్నాయా? లేక అధిష్టానమే గ్రూపులు ఏర్పడేందుకు దోహదపడి ఆపై వాటికి ఆజ్యం పోస్తోందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు పార్టీలోని ముఖ్య నాయకులు, సీనియర్ క్యాడర్ నుంచి వస్తున్నాయి. రాజకీయ పొత్తులు కుదురుతాయని, ఏదో ఒక పార్టీ నుంచి ఎవరో ఒకరు తరలివచ్చేస్తారని, బడా పారిశ్రామికవేత్తలో, ఎన్ఆర్ఐలో చేరిపోతారనే ముందస్తు అంచనాలు ఉన్నందునే గొడవలు రాజేయించడం, వాటిని కొనసాగింపజేయడం తమ అధినేతకు అలవాటేనని గత అనుభవాలను ఉదహరిస్తున్నారు. రాబోయే వారికి సీటు రిజర్వు చేయడం కోసం కొన్ని నియోజకవర్గాల్లో బహు నాయకత్వాన్ని పెంచిపోషించడం ముందు నుంచి ఉన్నదేనని విశ్లేషిస్తున్నారు.


సత్తెనపల్లిలో ముగ్గురి మధ్య..

డాక్టర్ కోడెల దివంగతులై మూడున్నరేళ్లు అయ్యింది. ఆయన కుమారుడు డాక్టర్ కోడెల శివరామకృష్ణ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను ఆశిస్తున్నారు. ఆయన తండ్రి స్పీకర్‌గా వ్యవహరించినప్పుడు నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. జిల్లాలోనే సీనియర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన డాక్టర్ కోడెల కుమారునికి, కానిపక్షంలో ఆయన కుటుంబీకుల్లో ఆసక్తి ఉన్న వారికి బాధ్యతలను అప్పగించవచ్చు. అలా చేయలేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు సైతం ఇన్‌చార్జి బాధ్యతలను ఆశిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు (అబ్బూరి మల్లి) కూడా కార్యక్రమాలను నిర్వహిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలకు తానూ పోటీలో ఉన్నట్లు వల్లె వేస్తున్నారు. తమవైపు ఏదో రోజు అధిష్టానం చూడకపోతుందా? అన్న ఆశతో ఈ ముగ్గురు క్యాంటీన్లను తమదైన రీతిలో నెట్టుకొస్తున్నారు. చంద్రబాబు ఆశీస్సులు తనకంటే తనకేనని ఇద్దరు అంటుంటే.. కాదు లోకేష్ ప్రోత్సాహం తనకేనంటూ మరొకరు ఎవరి స్థాయిలో వారు నియోజకవర్గ నాయకులు, శ్రేణుల వద్ద చెప్పుకుంటున్నది బహిరంగ రహస్యమే. ఓ వైపు గ్రూపుల మధ్య రచ్చను రాజేస్తూనే మరోవైపు రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు నేతృత్వంలో పరిశీలక కమిటీని నియమించడం తమ అధినేతకే చెల్లిందని వ్యాఖ్యానిస్తున్నారు. కమిటీ ఎదుటే వర్గాలుగా విడిపోయి గొడవ పడటం, సమావేశం రసాభాసగా మారడం పార్టీ నాయకులు, శ్రేణులకు తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమక్షంలో జరిగిన సమావేశమే నామ్‌కే వాస్తేగా మిగలడం, ఇదంతా అధినేత డైరెక్షన్‌లో నడిచిందనే వ్యాఖ్యలు అప్పట్లోనే వినిపించాయి. ఎవరి రాక కోసమో ఎదురుచూస్తూ, వారికి సీటు రిజర్వు చేసే ఉద్దేశంతో ఇలా తమ మధ్య తగవులను ప్రోత్సహించడం, పార్టీ నాయకులు, క్యాడర్‌లో పలుచన చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ముఖ్యుల నుంచి వస్తోంది.




గుంటూరు వెస్ట్‌లోనూ..

సత్తెనపల్లిలోనే కాదు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనూ ఇవే తరహా పరిస్థితులు కొనసాగుతున్నాయని పార్టీ ముఖ్యులు గుర్తుచేస్తున్నారు. రాజకీయ పొత్తుల్లో భాగంగా కాని, కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి సర్దుబాటు చేయడానికో ఈ స్థానాన్ని కూడా అధిష్టానం ఎటూకాకుండా చేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి వ్యతిరేకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తున్న వైనం, చంద్రబాబు తీరు నచ్చక టీడీపీ నుంచి గెలుపొందిన మద్దాళి గిరిధరరావు కొంతకాలానికే ఆ పార్టీకి దూరమయ్యారు. అప్పటి నుంచి నియోజకవర్గ బాధ్యతలను కోవెలమూడి రవీంద్రకు అప్పగించినప్పటికీ వర్గాలను మాత్రం ప్రోత్సహిస్తోందని పార్టీ నాయకులే గుర్తుచేస్తున్నారు. స్వయంగా చంద్రబాబే స్వచ్ఛంద కార్యక్రమాల ముసుగులో ఉయ్యూరు శ్రీనివాస్ అనే ప్రవాసాంధ్రునితో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారని అంటున్నారు. అందులో తొక్కిసలాట జరిగి ముగ్గురు పేద మహిళలు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సీనియర్లు కూడా అంటీముట్టనట్లు ఉండాల్సి వచ్చింది. మరోవైపు డాక్టర్ నిమ్మల శేషయ్యను ప్రోత్సహిస్తున్నారని పార్టీ నగర నాయకులు గుర్తుచేస్తున్నారు. భాష్యం విద్యా సంస్థలకు చెందిన ప్రవీణ్‌ను కూడా ప్రోత్సహిస్తోందని పార్టీ నాయకులు చెబుతున్నారు. హోర్డింగ్‌లతో నగరంలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా గుంటూరుకు మాత్రమే నగర పార్టీ కమిటీ ఉంది. డేగల ప్రభాకర్‌ను నగర అధ్యక్షుడిగా చేయడం, ఆయననూ ఓ ఆశావహునిగా కొనసాగింపజేయడం అధిష్టానానికే సాధ్యమవుతోందంటున్నారు. కోవెలమూడి రవీంద్ర ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నా పశ్చిమంలోని సీనియర్లయిన యాగంటి దుర్గారావు, కొమ్మినేని ప్రసాద్, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుల సహకారం లేదనేది శ్రేణులందరికీ స్పష్టంగా తెలుసు. చివరకు నగరపాలక సంస్థలో పార్టీ సహచర కార్పొరేటర్ల నుంచి కూడా ఏమాత్రం సహకారం లేదని కోవెలమూడి ఆవేదన వ్యక్తం చేయడం రివాజే. ఇక్కడ కూడా సత్తెనపల్లి తరహా ఎత్తుగడే. చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు ఆశీస్సులు నాయకులకు వేర్వేరుగా ఉంటున్నందున ఎవరి స్థాయిలో వారు గ్రూపు రాజకీయాలను కొనసాగిస్తున్నారు. నాయకుల మధ్య విభజించు పాలించు అనే సూత్రాన్ని అధినేతే అమలుపరుస్తున్నప్పుడు భవిష్యత్తులో తమ నియోజకవర్గాలకూ వ్యాపించదనే గ్యారంటీ ఏమిటనే అనుమానాలు సీనియర్లలోనూ తలెత్తుతున్నాయని జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. 'ఈ దఫా సీటు ఉండకపోవచ్చనే పుకార్లు పైస్థాయిలో నుంచే మొదలవుతాయి. చివరి క్యాడర్ వరకు అవి వ్యాపిస్తాయి. మీ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు ఉన్నాయంటూ మొదటికే మోసగించేలా ప్లాన్ చేసి అమలుచేయడం అలవాటే' అంటూ అధినేత తీరును దుయ్యబడుతున్నారు. 'నియోజకవర్గంలో ఏదైనా సమస్య ఉందనిపిస్తే తక్షణం సరిచేయాలి. లేదా సర్దుబాటు అయినా చేసేయాలి. ఇతర పార్టీలు ఎలా చేస్తున్నాయో చూసైనా తెలుసుకోవాలి. నలభై ఏళ్ల అనుభవమని చెప్పుకోవడానికే సరిపోతోంది' అని నగరానికి చెందిన సీనియర్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు.



దేవుడికి శఠగోపం!

- తప్పుడు లెక్కలు రాసి రూ.25 లక్షలు కాజేసిన ఉద్యోగి
- ఆడిట్‌లో వెలుగులోకి..
- నోటీసులు జారీ చేసిన అధికారులు
- రూ.5 లక్షలు తిరిగి చెల్లించిన అకౌంటెంట్
- మరో రూ.20 లక్షలు ఎలా రికవరీ చేయాలో తెలియక తలలుపట్టుకుంటున్న అధికారులు
- పూల సరఫరా, అన్నదానం, ప్రసాదం సరుకుల కొనుగోలులోనూ చేతివాటం



మంగళగిరి: భక్త జనకోటికి శుభాలు కలిగించి వారి కోరికలు తీర్చే లక్ష్మీనృసింహస్వామికే ఓ ఉద్యోగి శఠగోపం పెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించి భక్తులు మన్ననలు పొందిన అధికారులు ఉత్సవాల చివర రోజు వెలుగులోకి వచ్చిన ఘటనతో విస్మయం చెందారు. వాసు అనే ఉద్యోగి 2019 జూన్‌లో ఆలయంలో ఉద్యోగంలో చేరాడు. 2019 డిసెంబర్‌లో స్వామి లెక్కలు రాసే ఉద్యోగి బదిలీ కావడంతో వాసు బాధ్యతలు తీసుకున్నాడు. ఎగువ, దిగువ సన్నిధుల్లో ప్రతి రోజు టికెట్‌ల ద్వారా సమకూరే ఆదాయంతో పాటు ఇతర ఆదాయాలను లెక్కించి ప్రతి రోజు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. వాసు తాను ఉద్యోగంలో చేరినప్పటి నుంచి చేతివాటం మొదలు పెట్టాడు. 2019 డిసెంబర్‌లో బాధ్యతలు చేపట్టిన వాసు 2022 జూన్ వరకు ఇక్కడ విధులు నిర్వహించాడు. 30 నెలలు విధులు నిర్వహించిన సదరు ఉద్యోగి నెలకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు లెక్కల్లో తప్పులు చూపి పక్కదారి పట్టించి సుమారు రూ.25 లక్షలు వాడుకున్నట్లు తెలుస్తోంది. ఒక రోజులో ఎగువ, దిగువ సన్నిధుల్లో వచ్చిన ఆదాయాన్ని రసీదులతో సంబంధం లేకుండా రూ.15 నుంచి రూ.20 వేలు తగ్గించి లెక్కలు చూపి బ్యాంకు ఖాతాలో జమ చేసేవాడు. ఇటీవల ఆడిటర్ ఆలయ ఆదాయంపై ఆడిటింగ్ నిర్వహించే సమయంలో ఒక రోజు రసీదులకు ఆదాయానికి తేడా రావడంతో అనుమానం వచ్చి మొత్తం లెక్కలు తీయగా భారీ మొత్తంలో స్వామి ఆదాయాన్ని పక్కదారి పట్టించి వాడుకున్నట్లు గుర్తించారు. కొద్దికాలం క్రితం వైకుంఠపురం బదిలీ అయిన వాసు మళ్లీ మంగళగిరి ఆలయానికి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. తానే ఇక్కడ విధులు నిర్వహిస్తే ఎలాగైనా విషయం బయటకు పొక్కకుండా చూసుకోవచ్చనే వైకుంఠపురం నుంచి మంగళగిరి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అధికారులు నోటీసులు జారీ చేయడంతో వెంటనే రూ.5 లక్షలు చెల్లించిన వాసు, మళ్లీ చెప్పిన సమయానికి చెల్లించకపోగా ఫోన్‌కు సైతం అందుబాటులో లేకపోవడంతో మిగిలిన సొమ్ము ఎలా రికవరీ చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాసు విధులు నిర్వహించే సమయంలో స్వామి వారికి ప్రతి రోజు పూలదండలు, అన్నదానం, ప్రసాదం కోసం సరకులు సరఫరా చేసేవారితో కుమ్మక్కై బిల్లులు అధికంగా చెల్లించి నెలకు సుమారు రూ.25 నుంచి రూ.30 వేలు సరఫరాదారుల నుంచి కమీషన్లు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. దేవుడి సొమ్మును కాపాడాల్సిన ఉద్యోగి దేవుడికే శఠగోపం పెట్టడం విశేషం. ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి మాట్లాడుతూ వాసు అనే ఉద్యోగి విధులు నిర్వహించిన సమయంలో నిధులు పక్కదారి పట్టించి సొంతానికి వాడుకున్న విషయం వాస్తవమన్నారు. ఇప్పటి వరకు రూ.5 లక్షలు చెల్లించాడని తెలిపారు. ఇంకా లెక్కలు తేలాల్సి ఉందన్నారు. వాసు విధులు నిర్వహించే సమయంలో సుమారు రూ.25 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు గుర్తించామని చెప్పారు. పూర్తిస్థాయి విచారణ చేసి చట్టప్రకారం దేవుడి సొమ్ము మొత్తం రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా నృసింహుని శ్రీపుష్ప యాగోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి పుష్పయాగోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం దేవస్థానం ముఖమండపంపై స్వామి వారి శ్రీపుష్ప యాగోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అష్టదిక్పాలక ఆరాధనతో పాటు ఐదు రకాల పూలతో పుష్పార్చన, మంత్రపుష్పం, తీర్థగోష్ఠి జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు పూజలు నిర్వహించారు. స్వామివారి శ్రీపుష్పయాగోత్సవానికి నగరానికి చెందిన కీ.శే.నందం రాములు, పున్నమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు నందం సాంబశివరావు, శాంతికుమారి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



ఇంటర్ పరీక్షలపై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉమ్మడి జిల్లాలో జరగనున్న థియరీ పరీక్షలకు మొత్తం 134 పరీక్షా కేంద్రాల్లో 98,682 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. గుంటూరు జిల్లాలో 73 కేంద్రాల్లో 58,602 మంది, పల్నాడు జిల్లాలో 44 కేంద్రాల్లో 30,530 మంది, బాపట్ల జిల్లాలో 17 కేంద్రాల్లో 9,550 మంది పాల్గొంటారని వివరించారు. ఉమ్మడి జిల్లాల్లో ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఫొటో ఐడెంటిటీ ఒరిజినల్, హాల్ టికెట్ వెంట తీసుకురావాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించమన్నారు. పరీక్షలకు అరగంట ముందు అనుమతిస్తామని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు ఇంటర్మీడియెట్ బోర్డ్ ఇచ్చిన బేసిక్ ఫోన్లు మాత్రమే వాడాలన్నారు. ఓఎంఆర్ షీట్స్‌లో ఏదైనా పేజ్ చింపితే దానిని మాల్ ప్రాక్టీస్ కిందే పరిగణిస్తారని హెచ్చరించారు. పరీక్షలకు సంబంధించి వివరాల కోసం ఇంటర్మీడియెట్ రీజనల్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 0863–2228528ను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటశివరామిరెడ్డి, ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని, డీఈఓ శైలజ, జిల్లా ఎగ్జామినేషన్ సభ్యులు టి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థలంపై 'పాకుడురాళ్లు'

- దృశ్యరూపంగా రంగస్థలంపై ఆవిష్కరణ
- నేడు గుంటూరులో ప్రదర్శన
- జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ రచన
- నాటక రూపకర్త నస్రీన్ ఇషాక్



పాకుడురాళ్లు నాటకంలోని సన్నివేశం

తెనాలి: పాకుడురాళ్లు.. ప్రఖ్యాత రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ విశిష్ట రచన. సినిమా పరిశ్రమ కథా వస్తువుగా తెలుగులో వెలువడిన తొలి నవల. సినీ మాయతెరలను బహిర్గతం చేసిన నవలకు 'మాయజలతారు' అనుకున్నా, తర్వాత 'పాకుడురాళ్ల'గా నామకరణం చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఈ నవలపై పరిశోధనలు జరిగాయి. నవల రచయిత రావూరికి 2013లో ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ అవార్డు లభించింది. ఇప్పుడదే నవల రచయిత సొంత జిల్లా కేంద్రం గుంటూరులో దృశ్యరూపంగా పాకుడురాళ్లు రంగస్థలంపై ఆవిష్కృతం కానుండటం విశేషం.

ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సౌజన్యంతో..

గుంటూరు కళాపరిషత్ రజతోత్సవ ప్రత్యేక సంచిక 'దర్పణం' ఆవిష్కరణ మహోత్సవం శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు ఈ సంచికను ఆవిష్కరిస్తారు. సభానంతరం గుంటూరులోని ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సౌజన్యంతో నిభా థియేటర్ ఎన్సెంబుల్ సమర్పణలో 'పాకుడురాళ్లు' నాటకాన్ని ప్రదర్శిస్తారు. నాటక రూపకల్పన, దర్శకత్వం ప్రసిద్ధ నటి, దర్శకురాలు నస్రీన్ ఇషాక్.

నస్రీన్ ఇషాక్ మలచిన నాటకం..

ఆరు వందల పేజీల సుదీర్ఘమైన నవలకు రంగస్థల అనువాదం సాహసమే. ఇందులో అనేక పాత్రలు, అనేక సంఘటనలు, వ్యక్తులు, మోసాలు, కుతంత్రాలు, కుటిలత్వం, కపట ప్రేమలు, ఆవిరైపోతున్న కలలు.. ఇలా ఎన్నో భావోద్వేగాలు కలగలిపిన నవల ఇది. నటి, దర్శకురాలు, ప్రొఫెషనల్ థియేటర్ మేకర్ నస్రీన్ ఇషాక్, 'పాకుడురాళ్లు' నవలను 10 దృశ్యాలుగా కుదించి 1.45 గంటల నాటకంగా తెలుగు ప్రజల ముందుకు తీసుకొచ్చారు. తొలిగా గత ఏడాది అక్టోబరు 29, 30 తేదీల్లో హైదరాబాద్ రంగ్‌భూమిలో ప్రదర్శించారు. మూడో ప్రదర్శన అద్దంకి, నాలుగు, అయిదు ప్రదర్శనలు హైదరాబాద్‌లోనే ఇచ్చాక ఆరోసారి విశాఖలో ప్రదర్శించారు. ఇప్పుడు ఏడో ప్రదర్శనతో గుంటూరు నాటక, సాహిత్యాభిమానులను అలరించనున్నారు.

ఇప్పటికే ప్రశంసలు..

నవలలోని ప్రధాన పాత్రలను ఎంచుకుని, ఒక వరసలో సమకూర్చుకుని విభిన్నమైన ప్రదేశాలను ఏకకాలంలో ప్రేక్షకులకు చూపిస్తూ తన్మయత్వానికి గురిచేస్తారు ప్రదర్శకులు అన్న ప్రశంసలను అందుకుంది నాటకం. దర్శకురాలిగా నస్రీన్ ఇషాక్ పాత్రలకు తగిన నటీనటుల ఎంపికను చేసుకున్నారు. హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన తమిళమ్మాయి భావన వాసపందల్ మంజరిగా అచ్చు తెలుగమ్మాయిగా నటించారు. నటీనటుల శారీరక కదలికలు, ముఖంలో పలికించే భావోద్వేగాలు, ఆహార్యం ప్రేక్షకుడు ఆ పాత్రను గుర్తుపట్టేలా ఉంటాయి. ప్రతి దృశ్యంలోనూ రంగస్థలంపై లైటింగ్ సజీవతను తీసుకొస్తుంది. నాటక దృశ్యంలోని లాలిత్యాన్ని తెలియజేస్తూ సంగీతం మనసును రంజింపజేస్తుంది. నాటకంలో డిజైనింగ్, అంతకుమించి పాత్రలు ధరించే కాస్ట్యూమ్స్ ప్రత్యేకంగా ఉన్నాయన్న అభినందనలూ వచ్చాయి.



తెలుగు నాటకానికి నూతనోత్తేజం



నస్రీన్ ఇషాక్..

తెలుగు నాటకాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్న నస్రీన్ ఇషాక్‌కు 20 ఏళ్లకు పైగా నాటకరంగ అనుభవముంది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, న్యూఢిల్లీ నుంచి నటనలో గ్రాడ్యుయేషన్ చేశారు. నటిగా సుప్రసిద్ధ దేశ, విదేశీ నాటకరంగ దర్శకులతో పనిచేశారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌డీఎస్)లో నటిగా ఏడేళ్ల అనుభవం. వివిధ సంస్థల్లో చలన చిత్ర అధ్యాపకురాలిగా, డబ్బింగ్ కళాకారిణిగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, థియేటర్ ఆర్ట్స్ అధ్యాపకురాలిగా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గెస్ట్ లెక్చరర్‌గా చేశారు. హైదరాబాద్‌లోని 'సమాహార' అనే సంస్థ సహచర్యంతో తన సొంత గ్రూప్ 'నిభా థియేటర్ ఎన్సెంబుల్'తో 2016 నుంచి నాటకాలకు దర్శకత్వం వహిస్తున్నారు. పలు విదేశీ నాటకాలను హిందీలోకి అనువదించారు. చలం రచించిన 'మైదానం' నవలను ఒక సవాలుగా స్వీకరించి రంగస్థలంపైకి తీసుకురావటం గొప్ప ప్రయోగం.

ఆర్థిక, సామాజిక న్యాయాల మధ్య ప్రత్యక్ష సంబంధం

ఏఎన్‌యూ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రారంభమైన జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆర్థిక, సామాజిక న్యాయాల మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో '75 సంవత్సరాల భారతీయ ఆర్థిక వ్యవస్థ– ఆర్థిక వృద్ధి, పంపిణీ సమన్యాయం' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును గురువారం వీసీ ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగిస్తూ ఆర్థిక పంపిణీ అనేది మిగతా అన్ని రంగాలకు ప్రాథమిక పంపిణీ కేంద్రమన్నారు. ఆర్థిక అంశాలను పరిగణలోకి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, బిర్లా గ్లోబల్ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య సుధాకర్ పాండే

తీసుకోకుండా పూర్తిస్థాయి సామాజిక అంశాలను నిర్వచించలేమన్నారు. ఆర్థిక పంపిణీ సక్రమంగా జరగని అన్ని దేశాలు సాధికారతకు దూరంగానే ఉన్నాయన్నారు. భువనేశ్వర్, బిర్లా గ్లోబల్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ సుధాకర్ పాండా కీలకోపన్యాసం చేస్తూ జీ 20 దేశాల సమావేశాలు మన దేశంలో జరుగుతున్న తరుణంలో ఈ సదస్సులో చర్చించే ఆర్థిక, సామాజిక అంశాలు ప్రపంచానికి పెద్ద సందేశంగా నిలవాలన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య కె.మధుబాబు సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. సదస్సులో దేశ వ్యాప్తంగా 114 మంది పరిశోధనా పత్రాలు సమర్పిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ అధ్యక్షత వహించగా జబల్పూర్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రతినిధి డాక్టర్ శ్రీకృష్ణ సుధీర్, ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణిలు ప్రసంగించారు.

నులిపురుగుల నివారణతో రక్తహీనతకు చెక్

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు వెస్ట్: ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సుగల పిల్లల రక్తహీనతకు నులిపురుగులు కూడా ఒక ప్రధాన కారణమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలో గుర్తించిన 4,03,197 మంది పిల్లలకు ఆల్బెండజోల్ 400 మి.గ్రా టాబ్లెట్స్ వేయాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు, గ్రామ స్థాయిలో దీనిపై అవగహన కల్పించాలన్నారు. ఏడాది లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయకూడదని చెప్పారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు అరమాత్ర నీటిలో కలిపి పట్టాలని చెప్పారు. 19 సంవత్సరాల పిల్లలకు మధ్యాహ్నం భోజనం తర్వాత ఇవ్వాలని, దీనిని చప్పరించవచ్చని తెలిపారు. మన రాష్ట్రంలో ప్రతి వంద మంది పిల్లల్లో 34 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు. అయితే ఈ మాత్రలు వేసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందని కలెక్టర్ వివరించారు.

గర్భిణులు మాత్రలు వేసుకోవద్దు

జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు మాట్లాడుతూ గర్భిణులు, ఏడాదిలోపు పిల్లలు, అధిక జ్వరం, వాంతులు, విరోచనాలు అనారోగ్యంతో ఉన్న వారు ఆల్బెండజోల్ మాత్రలు వాడకూడదన్నారు. గతంలో ఈ మాత్రలు వికటించిన వారికి కూడా వద్దన్నారు. నులిపురుగుల నుంచి రక్షణకు శుభ్రమైన నీరు తాగడం, తిన్న తర్వాత, మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. అనంతరం నులిపురుగులపై అవగాహన కల్పించే పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని, డీఈఓ శైలజ, హౌసింగ్ పీడీ సాయినాథ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

నైపుణ్యాల అభివృద్ధితో ఉన్నతోద్యోగాలు

తాడేపల్లిరూరల్: విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి కూడా అత్యవసరమని, తద్వారానే ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. వడ్డేశ్వరంలోని కె.ఎల్.యూనివర్సిటీ క్యాంపస్‌లో గురువారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ క్యాంపస్ ప్లేసిమెంట్స్ లో మంచి ప్రతిభ చూపించి 100% క్యాంపస్ ప్లేసిమెంట్స్ సాధించటం గొప్ప ఘనతని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అత్యధిక వార్షిక ప్యాకేజీ పొందిన విద్యార్థులకు ఆయన మెమెంటోలను అందచేశారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ 2005వ సంవత్సరం నుంచి 17 సంవత్సరాలుగా 100% ప్లేసిమెంట్స్ సాధిస్తున్నామని చెప్పారు. కె ఎల్.యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారధివర్మ, ప్రో.వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్, వీసీ కోనేరు సత్యన్నారాయణ, తదితరులు

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు నిరంతరం కొనసాగాలి...

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందేవిధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల నిర్మాణం ఉగాది నాటికి పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, వాటర్, విద్యుత్ కనెక్షన్స్ ఇవ్వాలన్నారు. కంటి వెలుగు ఫేజ్-3లో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు పరీక్షలు నిర్వహించేందుకు సచివాలయాల వారీగా ప్లాన్ చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ కనీసం 60 మందికి చూడాలని, దీనికి ముందు రోజు ప్రణాళిక చేసుకోవాలన్నారు. జ్వరం, దగ్గు వస్తే ప్రజలు సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చూపించుకునే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పనులకు నిర్దేశించిన సమయంలోనే డబ్బులు అందించే విధంగా అధికారులు చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని, డీఈఓ శైలజ, జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.7000, గరిష్ఠ ధర రూ.9200, మోడల్ ధర రూ.8100 వరకు పలికింది.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన

గుంటూరు ఎడ్యుకేషన్: సీడాప్, మార్గ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిట్టర్ ఎలక్ట్రికల్ కోర్సుల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు మార్గ్ శిక్షణా కేంద్రం హెడ్ అంబటి గోపీచంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అర్హతలతో 18 నుంచి 25 ఏళ్ల లోపు వయసు గల పురుష అభ్యర్థులకు గుజ్జనగుండ్ల సర్కిల్‌లోని ఎస్‌బీఐపై అంతస్తులో ఉన్న మార్గ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో మూడు నెలలపాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని తెలిపారు. శిక్షణానంతరం నూరుశాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 91334449 85, (86), (88), (89), నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహం నిలిపివేత

పెదనందిపాడు: మైనర్ బాలికకు పెళ్లి జరుగుతున్న విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సిబ్బంది ఆ వివాహాన్ని నిలిపివేసిన ఘటన గురువారం మండలంలోని గోగులమూడిలో జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీరా తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గోగులమూడి గ్రామానికి చెందిన అముదాలపల్లి రవీంద్రకుమార్, బాపట్లకు చెందిన మైనర్ బాలికతో వివాహం చేసుకుంటున్నారని, బయట వ్యక్తులు ఫోన్ చేసి ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు ఘటనా స్థలికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించి, వివాహాన్ని నిలిపివేసినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మహిళా పోలీసు మాధవి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆరు రేవులలో పడవలు తిప్పుకొనేందుకు వేలం

చింతపల్లి రేవుకు ఎనిమిది రెట్లు అధికంగా ఖరారైన పాట

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో జెడ్పీ అధీనంలోని 12 రేవుల్లో పడవలను తిప్పుకొనేందుకు గురువారం నిర్వహించిన వేలంలో ఆరు రేవులను పాటదారులు చేజిక్కించుకున్నారు. జెడ్పీ సీఈఓ జె.మోహనరావు అధ్యక్షతన జెడ్పీ కార్యాలయంలో జరిగిన సీల్డ్ టెండరు, బహిరంగ వేలంలో ఏడాది కాలానికి హక్కులకుగాను చింతపల్లి రేవుకు నిర్ణయించిన అప్‌సెట్ ధర రూ.50వేలకు గుర్రం కొండలు ఎనిమిది రెట్లు అధికంగా రూ.4.50లక్షలకు పాడుకుని అత్యధిక పాటదారునిగా నిలిచారు. అదేవిధంగా చామర్రు రేవుకు నిర్ణయించిన రూ.2లక్షల అప్‌సెట్ ధరలో గడ్డం రామయ్య రూ.2,02,011లకు, గింజుపల్లి రేవుకు నిర్ణయించిన రూ.50వేలకు గాను బి.లక్ష్మానాయక్ రూ.1.21లక్షలు, తాడువాయి రేవుకు నిర్ణయించిన రూ.10 లక్షలకు గాను వి.వెంకటేశ్వర్లు రూ.10.20 లక్షలకు, ధరణికోట రేవుకు రూ.10వేలకు గాను ఎం. ఏడుకొండలు రూ.11,500లకు, మాదిపాడు రేవుకు నిర్ణయించిన రూ.10లక్షలకు గాను కె. వెంకట నారాయణ రూ.14లక్షలకు పాడుకున్నారు. మరో ఆరు రేవులకు సంబంధించి వేలంలో పాటదారులు ఎవ్వరు హాజరు కాకపోవడంతో వాటిని తదుపరి వేలానికి వాయిదా వేసినట్లు సీఈఓ జె. మోహనరావు తెలిపారు.

తెలుగు కళాసమితి కథా నాటిక/ నాటక రచనా పోటీలు

ఉత్తమ రచనలకు రూ.లక్ష బహుమతి

తెనాలి: విశాఖపట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ తెలుగు కళాసమితి 2023 సంవత్సరానికి 12వ కథా నాటిక/స్వీయ నాటికల రచనల పోటీలను ప్రకటించింది. ఈ ఏడాది ప్రథమ కథా నాటకం/స్వీయ నాటకం రచనల పోటీలను కూడా ప్రకటించటం విశేషం. కళాసమితి వ్యవస్థాపకుడు వై.ఎస్.కె.ఎస్.స్వామి గురువారం తెనాలిలో ఈ పోటీల ప్రకటనను వెలువరించారు. కథా నాటకం, కథా నాటికలకు ప్రింట్ మీడియం లేదా డిజిటల మీడియా నుంచి తీసుకోవచ్చునని, నవల ఆధారంగానూ నాటక రచనలు చేయొచ్చని తెలిపారు. తగిన అనుమతిపత్రం జత చేయాలన్నారు. నాటిక రచన 23 పేజీలకు మించకుండా, నాటకం రచన 40 పేజీలకు తక్కువ లేకుండా పంపించాలని వివరించారు. నాటక రచనల పోటీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, నాటికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల రచయితలు తమ రచనలను ఏప్రిల్ 25వ తేదీలోగా వైఎస్‌కేఎస్ స్వామి, తెలుగు కళాసమితి, డోర్ నెం.49-36-11/3, ప్లాట్ నెం.202, ఎంవీవీ రెసిడెన్సీ, ఎన్‌జీవోస్ కాలనీ, అక్కయ్యపాలెం, విశాఖపట్టణం–530016 చిరునామాకు పంపాలని వివరించారు. ఇతర వివరాలకు 9666817969, 9247333482 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 66 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 250 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 100 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 35 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 100 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1065 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి.. యువకుడు ఆత్మహత్య

గొడవర్రు(చేబ్రోలు): ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఇంటికి వచ్చి డబ్బులు కట్టమని ఒత్తిడి చేయటంతో మనస్థాపానికి గురైన యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గొడవర్రు గ్రామానికి చెందిన ఉల్లిగంటి గోపి(29) తెనాలిలోని ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో రుణం తీసుకున్నాడు. తీసుకున్న బాకీకి వడ్డీ కడుతున్న గోపి అసలు చెల్లించటంలో జాప్యం జరిగింది. దీంతో ఈనెల 8వ తేదీ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఇంటికి వచ్చి బాకీ తీర్చాలని తీవ్ర ఒత్తిడి చేశారు. ఈ విషయమై ఇంటిలో భార్యభర్తలు మధ్య వివాదం జరిగింది. భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం ఉదయం గోపి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి ఉల్లిగంటి శివకుమారి చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.



ఉల్లిగంటి గోపి(ఫైల్)